

సోమశిలలో 7.967 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం సాయంత్రానికి 7.967 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,605
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,803
సవర (8 గ్రాములు)	రూ.54,424



వైఎస్సార్‌సీపీలో చేరికలు

నెల్లూరులోని విజయసాయిరెడ్డి క్యాంపు కార్యాలయంలో బొందిలి సామాజికవర్గ నాయకులు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు.

8లో

న్యూస్‌రీల్

పాడి ఆవులకు రూప్‌కుమార్ వకాల్తా

- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి విమర్శ




మాట్లాడుతున్న కనుమూరి రవిచంద్రారెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో టీడీపీకి చెందిన ధనికులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణలకు మాత్రమే రూప్‌కుమార్ వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నాడని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో వాటర్ ప్లాంట్ పెట్టి శాశ్వత పబ్లిసిటీ చేసుకునే నైజం వేమిరెడ్డిదన్నారు. తమ నాయకుడు విజయసాయిరెడ్డి స్వగ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సొంత భూమి 1.75 ఎకరాలు అందచేశారన్నారు. అంతేకాకుండా రూ.7.5 కోట్లతో భవనం నిర్మించారన్నారు. సాగు కాలువలను రూ.4కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. నోడల్ జిల్లాగా విశాఖపట్నంను రూ.30కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరిన రూప్‌కుమార్ ఆర్థికంగా, రాజకీయంగా వైఎస్సార్‌సీపీ తోనే అభివృద్ధి చెందారన్నారు. సిటీ అభ్యర్థి నారాయణ ఎన్నికల అఫిడవిట్లో తప్పుడు వివరాలు అందజేశారని, దానిపై సమాధానం చెప్పాలన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

నెల్లూరు(అర్బన్): చట్టానికి విరుద్ధంగా స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. గురువారం నగరంలోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలోని స్కానింగ్ సెంటర్‌ను, ఎఆర్‌టి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. పెద్దాస్పత్రికి చెందిన గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ గీతాలక్ష్మి, డెమో అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కనకరత్నం, కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని పోలింగ్ బూత్‌లలో నిరంతర విద్యుత్ సరఫరా



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): జిల్లాలో ఏర్పాటు చేసిన 2,942 పోలింగ్ బూత్ లలో నిరంతర విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ తెలిపారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ నుంచి ప్రతి పోలింగ్ బూత్ వద్ద విద్యుత్ సిబ్బంది విధి నిర్వహణలో ఉండేలా కార్యాచరణ రూపొందించామని అన్నారు. ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూంలు, ఎన్నికల కౌంటింగ్ కేంద్రం కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పెళ్లికి ముందే వరుడు పరార్

- కన్నీటి పర్యంతమైన వధువు

నెల్లూరు(క్రైమ్): పెళ్లికి ముందే వరుడు పరారవ్వడంతో వధువుతో పాటు ఆమె కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుల సమాచారం మేరకు... హైదరాబాద్‌లో ఉంటున్న ఓ యువతికి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన యువకునితో గతేడాది నిశ్చితార్థం జరిగింది. ఈనెల ఎనిమిదో తేదీ వివాహం చేసేందుకు ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించారు. ఈ క్రమంలో యువకుడు కోరిన విధంగానే వధువు కుటుంబసభ్యులు కట్న, కానుకలు ఇచ్చారు. లక్షలు ఖర్చుచేసి నగరంలోని ఓ హోటల్‌లో మండపాన్ని బుక్‌చేశారు. ఈనెల 8వ తేదీన వివాహం జరగాల్సి ఉండగా వరుడు, అతని కుటుంబసభ్యులు కళ్యాణమంటపానికి రాలేదు. వారికి ఫోన్‌చేయగా స్విచ్ ఆఫ్ వస్తోంది. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ రావడంతో వధువు, ఆమె కుటుంబసభ్యులు మోసపోయామని గ్రహించి కన్నీటి పర్యంతమయ్యారు. వివాహానికి ముందే నగదు, బంగారు ఆభరణాలు ఇచ్చామని వాపోయారు. వధువు పేరుపైనున్న కారును తన పేరుపై మార్చాలని వరుడు కోరగా వివాహానంతరం మారుస్తానని చెప్పామని బాధిత యువతి కన్నీటిపర్యంతమైంది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

పారిశ్రామిక పురోగతి

ప్రాజెక్టులు ఇవే..

మెగాప్రాజెక్టులలో భాగంగా నాయుడుపేట ప్రాంతంలో గ్రీన్ టెక్ ఇండస్ట్రీ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టుతో దాదాపు రూ.627 కోట్ల పెట్టుబడులు పెట్టి.. ఆటోమొబైల్ పరికరాలు తయారీ ఉత్పత్తి కూడా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2200 మందికి ఎంప్లాయిమెంట్‌తో పాటు పరోక్షంగా మరో పదివేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.

అలాగే తడ సమీపంలో రూ.1450 కోట్ల పెట్టుబడులతో భారత్ పోర్ట్, అల్ట్రా మెరైన్ పిగ్మెంట్ లిమిటెడ్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచారు. వీటి ద్వారా దాదాపు 3,500 వేల మందికి ఉపాధి కలగనుంది.

- అలాగే గ్రీన్ లామ్స్, తారకేశ్వర టెక్స్‌టైల్స్, డెల్టా బయోఫార్మా వంటి 18 పరిశ్రమలు రూ.12,600 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలో ఆయా పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటి వల్ల 14 వేల మందికి ఉపాధి లభించనుంది.
- కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఉత్కర్ష అల్యూమినియం ధాతు లిమిటెడ్ (మిథాని –ఎన్ఏటీ) వంటి పరిశ్రమ ఏర్పాటుకు భూసేకరణ అడ్డంకులు తొలగిపోయి ఏర్పాటుకు సిద్ధంగా ఉంది. దాదాపు రూ.4 వేల కోట్లతో ఈ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు.

- రామాయపట్నం పోర్ట్‌కు అనుబంధంగా జిల్లాలో 2 వేల ఎకరాల్లో మెగా ఇండస్ట్రియల్ హబ్, 126 ఎకరాలలో ఒక సాఫ్ట్‌వేర్ పార్క్
- 1,250 ఎకరాలలో ఒక ఫర్నిచర్ పార్క్ ఏర్పాటుకు భూమి కేటాయింపు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.
- మనుబోలు మండలంలో శ్రీచక్ర ఎకో టెక్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఏర్పాటు చేశారు. ఆ కంపెనీలో పాలిస్టర్ ఫైబర్ తయారీ ఉంటుంది. దాదాపు రూ.350 కోట్లతో ఏర్పాటయిన ఈ ప్రాజెక్టులో 300 మందికి ఉపాధి లభిస్తోంది.
- ముత్తుకూరు మండలంలోని పంటపాళెంలో ఎడిబిజిబుల్ ఆయిల్ తయారీ కేంద్రం ఏర్పాటు చేశారు. రూ.290.79 కోట్ల పెట్టుబడులతో ప్రాజెక్టు ఏర్పాటయింది. 120 మందికి ఉపాధి అవకాశాలు పొందారు.
- బోగోలు మండలం జువ్వలదిన్నెలో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ఫుడ్‌పార్కును ఏర్పాటు చేశారు. రూ.2000 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ కంపెనీలో 1000 మందికి ఉపాధి లభించింది.
- సర్వేపల్లి నియోజకవర్గంలో వెంకటాచలం మండలంలోని క్రిభ్‌కో గ్రీన్‌ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేశారు. రూ.725 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటయిన కంపెనీలో 400 మందికి ఉపాధి దొరికింది.



ముత్తుకూరు మండలం పంటపాళెంలో నిర్మాణంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ



పొదలకూరు మండలం ప్రభగిరిపట్నం వద్ద కిసాన్‌క్రాఫ్ట్ పరిశ్రమ

- పారిశ్రామిక రంగంలో పెట్టుబడుల వెల్లువ
- ఉమ్మడి జిల్లాలో రూ.వేల కోట్ల పెట్టుబడులు
- వేలాది మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు
- పరోక్షంగా లక్షలాది మందికి జీవనోపాధి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సువిశాలమైన తీర ప్రదేశం.. ప్రత్యేక ఆర్థిక మండళ్లు.. తీరం చెంత భారీ పోర్టు వాటి అనుబంధ పరిశ్రమలతో పారిశ్రామిక హబ్‌గా ఉన్న ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పారిశ్రామికరంగ పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణంతో పాటు ఆ రంగాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు పడుతున్నాయి.

పెట్టుబడుల వెల్లువ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలల కాలంలోనే పారిశ్రామిక ప్రగతి వైపు దృష్టి సారించింది. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు అనువైన వాతావరణం కల్పించింది. దీంతో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు.

పారిశ్రామిక హబ్‌గా సర్వేపల్లి..

సర్వేపల్లి నియోజకవర్గం పారిశ్రామిక హబ్‌గా మారింది. ముత్తుకూరు మండలం పంటపాళెం పంచాయతీలో 5 పామాయిల్ రిఫైండ్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇటీవల ఇదే పంచాయతీలో మరో 3 ఫ్యాక్టరీలను ప్రారంభించారు. ఈపూరు పంచాయతీలో ఒక ఫ్యాక్టరీతో కలిపి మొత్తం 9 పామాయిల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ ప్రభుత్వంలో మూడు పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణానికి అనుమతులు లభించాయి. ఫ్యాక్టరీల్లో మొత్తం 3వేల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిశ్రమల స్థాపన ఊపందుకుంది. ఈ పరిశ్రమల నిర్మాణం పూర్తి అయితే వందలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. మనుబోలు మండలంలో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్, అట్టల ఫ్యాక్టరీలను నెలకొల్పి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

పరిశ్రమలకు బీజం వేసింది వైఎస్సార్



జిల్లాలో పరిశ్రమల స్థాపనకు బీజం వేసింది దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ప్రస్తుత ప్రభుత్వంలో చాలా పరిశ్రమలు నెలకొల్పడం జరిగింది. ఒక్క పంటపాళెంలో 5 పామాయిల్ పరిశ్రమలు స్థాపించి ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం సంతోషకరం.

– వర్రి సుబ్రహ్మణ్యం, ఈపూరు, ముత్తుకూరు

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు. మనుబోలు మండలంలో రెండు పరిశ్రమలను నెలకొల్పారు. ప్రభుత్వం సింగిల్ విండో సిస్టమ్ అనుమతులు ఇస్తుండడంతో పరిశ్రమల సంఖ్య పెరుగుతోంది. మా మండలంలో జీడిపప్పు ప్రాసెసింగ్, అట్టల ఫ్యాక్టరీలు నెలకొల్పారు.

– ఏలూరు భాస్కర్‌రెడ్డి, మనుబోలు

కిసాన్‌క్రాఫ్ట్‌లో ఉద్యోగాలు



మండలంలో నెలకొల్పిన కిసాన్‌క్రాఫ్ట్‌లో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించారు. ఇందువల్ల యువత దూరప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులో ఉన్న ఫ్యాక్టరీలో ఉద్యోగాలు చేసుకుని జీవిస్తున్నారు. ఫ్యాక్టరీ నెలకొల్పేందుకు మంత్రి కాకాణి పూర్తి సహకారం అందించారు.

– ఆర్.సుబ్బరామిరెడ్డి, తాటిపర్తి, పొదలకూరు(మం)

పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉంది. దీంతో పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఏడాది కాలం వ్యవధిలోనే వందల కోట్లు పెట్టుబడులు పెడతామంటూ పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారు. పరిశ్రమలు వస్తే ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.

–కేసీ సుధాకర్, పరిశ్రమల శాఖ జీఎం

తమ్ముళ్ల తన్నులాటలు..!

- ప్యాకేజీలతో వలస నేతల కొనుగోళ్లు
- జెండా మోసిన వారికి దక్కని ప్రాధాన్యత
- ఆత్మకూరులో ఆధిపత్య పోరుతో ఆనంకు తలబొప్పి
- ఆనం ముందే రెండు వర్గాల ముష్టిఘాతాలు
- కోవూరులో తమ్ముళ్ల మధ్య అదే పరిస్థితి



నాగులవెల్లటూరులో టీడీపీ వర్గాల తోపులాట మధ్య ఇరుక్కుపోయిన ఆనం రామనారాయణరెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో టీడీపీ అభ్యర్థులకు అడుగడుగునా వర్గాల కుంపట్ల సెగ తగులుతోంది. పార్టీలో సుదీర్ఘంగా ఉన్న నేతలకు, ఎన్నికల వేళ ప్యాకేజీల కోసం వచ్చిన నేతలకు మధ్య సమన్వయం లేక సెగ పెరుగుతోంది. గ్రామస్థాయిలో నెలకొన్న టీడీపీ నేతల వర్గ పోరుతో అభ్యర్థులకు తలబొప్పి కడుతోంది. నిన్న కోవూరులో జరిగిన కుమ్ములాటలు మరువక ముందే చేజర్ల మండలంలో తమ్ముళ్ల మధ్య రగిలిన వివాదం తారస్థాయికి చేరి ముష్టిఘాతాల వరకు వెళ్లింది. ఒకనొక దశలో ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తమ్ముళ్ల కుమ్ములాటల మధ్య ఇరుక్కుపోయి విలవిలలాడారు.

వలస నేతలతో చిచ్చు..

ఎన్నికల వేళ జిల్లాలో టీడీపీకి క్షేత్రస్థాయిలో చిత్రమైన పరిస్థితి ఎదురవుతోంది. ఈ ఎన్నికల్లో కొన్ని చోట్ల టీడీపీ టికెట్లను పార్టీలో సుదీర్ఘంగా ఉన్న వారిని కాదని వలస నేతలకు (వైఎస్సార్‌సీపీ నుంచి బహిష్కృతులైన వారికి) అధిష్టానం ఇచ్చింది. దీంతో పోటీచేస్తున్న అభ్యర్థులకు ఆయా నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్ నుంచి సరైన ఆదరణ లభించడం లేదు. డబ్బు మూటలు వెదజల్లినా, ప్రలోభాలకు గురిచేసినా సరైన ప్రజాస్పందన లేకపోవడంతో అభ్యర్థులు ప్యాకేజీల ఆఫర్లతో వలస నేతలను పార్టీలోకి తీసుకున్నారు. గత ఎన్నికల్లో టీడీపీకి పనిచేసి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అధికారం కోసం పార్టీ ఫిరాయించి పనులు చేసుకుని వెళ్లిన వారికి ప్యాకేజీలు ఇచ్చి పార్టీ కండువాలు కప్పి వారికే పెత్తనాలు అప్పగించారు. కష్ట కాలంలో పార్టీకి అండగా ఉన్న నేతలను విస్మరించడంతో అక్కడే వర్గ భేదాలు వచ్చాయి. ప్రధానంగా ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గాలలో టీడీపీలో తమ్ముళ్ల కుమ్ములాటలు, కీచులాటలతో వీధిన పడుతున్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీలో రగులుతున్న వర్గపోరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డికి తలబొప్పి కట్టిస్తోంది. నియోజకవర్గంలో రోజు రోజుకు పార్టీ గ్రాఫ్ పడిపోతుండడంతో పాటు స్వపక్షంలో నేతల మధ్య రగిలే వర్గ కుంపట్లు ఆనంకు తలనొప్పిగా మారాయి. ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీకి బలమైన క్యాడర్ ఉండడంతో టీడీపీ తరుపున పోటీ చేసేందుకు ఆనం రామనారాయణరెడ్డి ముందు జంకారు. వేమిరెడ్డి రాకతో ఆనంకు బంఫర్ ఆఫర్ ఇవ్వడంతో పోటీకి సై అన్నారు. ఇప్పటికే వేమిరెడ్డి ఇచ్చిన భారీ ప్యాకేజీతో పార్టీలో జోష్ పెంచేందుకు వలస నేతలందరికీ భారీ ప్యాకేజీలు ఇచ్చి కొనుగోలు చేశారు. కానీ డబ్బులకు అమ్ముడుపోయి కండువాలు కప్పుకున్న నేతలతో స్థానిక టీడీపీ క్యాడర్ కలిసి పనిచేసేందుకు ఇష్టపడటం లేదు. పార్టీ జెండా మోసిన వారిని కాదని అమ్ముడు పోయిన నేతలకు పెత్తనం ఇస్తున్నారని నిజమైన నేతలు లోలోన రగిలిపోతున్నారు. దీంతో పార్టీలోనే రెండు వర్గాలుగా విడిపోయి వీధిన పడుతున్నారు. తాజాగా చేజర్ల మండలం నాగులవెల్లటూరులో గురువారం తమ్ముళ్ల మధ్య ముష్టి యుద్ధాల వరకు దారి తీసింది. ఆ గ్రామంలో కేశవ చౌదరి, రవీంద్రనాయుడు మధ్య జరిగిన రగడ తమ్ముళ్లను వీధిన పడేసింది.

కోవూరులో తమ్ముళ్ల కీచులాటలు

కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి కూడా వర్గపోరు తలబొప్పి కట్టిస్తోంది. ప్రశాంతిరెడ్డి పెద్ద ప్యాకేజీలతో వలస నేతలను పార్టీలోకి తీసుకున్నారు. దీనికితోడు దశాబ్దాల కాలంగా పార్టీని నమ్ముకుని ఉన్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి తన డబ్బు మూటలతో టికెట్ రాకుండా చేయడంతో ఆయన వర్గం లోలోన రగిలిపోతోంది. అటు నిజమైన పార్టీ క్యాడర్, మరోవైపు దినేష్ వర్గం, ఇంకో వైపు ప్యాకేజీ నేతలతో మూడు వర్గాలుగా ఉన్నారు. వీరందరూ కలిసి పనిచేసేందుకు ఏమాత్రం ఇష్టపడటం లేదు. కేవలం డబ్బుమూటల కోసమే పనిచేస్తున్నట్లు నటిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇందుకూరుపేట, గంగపట్నం, కోవూరు మండలం గంగవరం, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లిలో జరిగిన తమ్ముళ్ల కుమ్ములాటలు వీధికెక్కాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రాజకీయ పరిపక్వత లేకనే..

ప్రత్యక్ష రాజకీయ అనుభవాలు లేని ప్రశాంతిరెడ్డికి రాజకీయ పరిపక్వత కూడా లేదు. పార్టీలో ప్రతి ఊరిలో రాజకీయ ఆధిపత్యం నేపథ్యంలో రెండు.. మూడు గ్రూపులు ఉన్నాయి. రాజకీయంగా ఎన్నికల సమయంలో వీరిని సమన్వయం చేసుకోకపోతే అసలుకే మోసం వస్తుంది. అందరిని సంతృప్తి పరిస్తే కానీ రాజకీయంగా నెగ్గుకురావడం కష్టం. ప్రస్తుతం టీడీపీ నుంచి కామధేనువు వంటి ప్రశాంతి పోటీ చేస్తుండడంతో ఆధిపత్యం ప్రదర్శించి, ఆర్థిక లావాదేవీల పెత్తనం చేయొచ్చని కొందరు నేతలు భావిస్తున్నారు. అయితే గ్రామాల్లో నేతలను సమన్వయపరచడంలో విఫలం కావడంతో మరికొందరు బయటకుపోతున్న పరిస్థితి నెలకొంది. కొందరికే మూటలు ఇచ్చి.. ప్రాధాన్యం ఇస్తుండడంతో వర్గాల కుంపట్ల సెగ మరింతగా పెరుగుతోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

అన్నారెడ్డిపాళెంలోనూ అదే తీరు

కోవూరు/విడవలూరు: వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి టీడీపీలో నేతల మధ్య విభేదాలు చికాకు తెపిస్తున్నాయి. గురువారం ఆమె అన్నారెడ్డిపాళెం గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు మడపర్తి చరణ్ ఆధ్వర్యంలో ప్రశాంతిరెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కొంతసేపటికి సింహాద్రి అయ్యప్ప(ఇటీవల వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు) ప్రచార రథం ఎక్కడంతో మడపర్తి చరణ్ వర్గం అసంతృప్తికి లోనైంది. ఇన్ని సంవత్సరాల నుంచి పార్టీని నమ్ముకుని కష్టపడుతున్న తమను పక్కన పెట్టి ఇటీవల పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసింది. అయ్యప్పను రథం నుంచి దింపితేనే ప్రచారం ముందుకు సాగుతుందని భీష్మించారు. దీంతో ప్రచార రథంపై ఉన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మండల టీడీపీ నాయకులు సర్దిచెప్పినా గొడవ సద్దుమణగలేదు. దీంతో చేసేదేమిలేక ప్రశాంతిరెడ్డి ప్రచారరథం దిగి తన కారులోకి వెళ్లారు. దీంతో అక్కడే ఉన్న నాయకులు కారు ఆపి ఆమెను బుజ్జగించి మరలా ప్రచార రథం ఎక్కించారు. అయినా కొంతసేపటికి మళ్లీ ఇదే పరిస్థితి పునరావృతం అవ్వడంతో తూతూ మంత్రంగా ప్రచారం పూర్తి చేసి వెళ్లిపోయారు.

ఎన్నికల సిబ్బంది తరలింపునకు 255 బస్సులు

- అన్ని ప్రధాన బస్టాండ్ల నుంచి ఏర్పాటు చేసిన అధికారులు
- కందుకూరు నుంచి వెంకటగిరి వెళ్లే వారికి నెల్లూరులో లింక్ బస్సులు


నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా మే 13న పోలింగ్ విధులు కేటాయించబడిన పోలింగ్ అధికారులు, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు 255 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. జిల్లాలోని వివిధ బస్టాండ్ల నుంచి సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల విధులకు వెళ్లనున్న అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు లేకుండా చేరుకునేలా అన్ని మార్గాల్లో రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. 12వ తేదీ ఉదయం 6 గంటలకు సంబంధిత బస్టాండ్ల నుంచి బస్సులు బయరుదేరుతాయని, అదే విధంగా 13వ తేదీ రాత్రి 10.30, 11.30, 12.30 గంటలకు తిరుగు ప్రయాణమవుతాయని చెప్పారు.

బస్సులు బయలుదేరు వివరాలు

నెల్లూరు మెయిన్ బస్టాండ్ నుంచి కందుకూరుకు 19 బస్సులు, కావలికి 23, ఆత్మకూరుకు 18, ఉదయగిరికి 27, సర్వేపల్లికి 16 బస్సులు బయలుదేరుతాయి. కావలి మెయిన్ బస్టాండ్ నుంచి కందుకూరుకు 4, ఆత్మకూరుకు 8, కోవూరుకు 5, నెల్లూరుకు 9, సర్వేపల్లికి 5, ఉదయగిరికి 5 బస్సులు బయలుదేరుతాయి. కందుకూరు మెయిన్ బస్టాండ్ నుంచి కావలికి 5, ఆత్మకూరుకు 4, కోవూరుకు 5, నెల్లూరుకు 5, సర్వేపల్లికి 5, ఉదయగిరికి 5 బస్సులు బయలుదేరుతాయి. ఆత్మకూరు మెయిన్‌బస్టాండ్ నుంచి కావలికి 6, కందుకూరుకు 8, కోవూరుకు 6, నెల్లూరుకు 12, సర్వేపల్లికి 6, ఉదయగిరికి 6 బస్సులు బయలు దేరుతాయి. ఉదయగిరి మెయిన్ బస్టాండ్ నుంచి కావలికి 8, కందుకూరుకు 6, కోవూరుకు 6, నెల్లూరుకు 11, సర్వేపల్లికి 5, ఆత్మకూరుకు 7 బస్సులు బయలుదేరుతాయి.

కందుకూరు నుంచి వెంకటగిరికి పోలింగ్ విధుల నిమిత్తం వెళ్లే సిబ్బందికి నెల్లూరు మెయిన్ బస్టాండ్‌లో రెండు లింక్ (కనెక్టింగ్) బస్సులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. కందుకూరు బస్టాండ్ నుంచి బయలుదేరిన బస్సులు నెల్లూరు మెయిన్ బస్టాండ్ వరకు ప్రయాణిస్తాయని, నెల్లూరు నుంచి వెంకటగిరి వెళ్లేందుకు రెండు లింక్ (కనెక్టింగ్) బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మతతత్వ పార్టీతో పొత్తేమిటి చంద్రబాబు



రోడ్డుషోలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- ముత్తుకూరు రోడ్ షోలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శ

ముత్తుకూరు: ముస్లింలలో పేదవర్గాలకు చెందిన వారి రిజర్వేషన్లను రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్న బీజేపీ లాంటి మతతత్వ పార్టీలతో చంద్రబాబు నాయుడు చేతులు కలిపి కూటమిగా ఏర్పడ్డారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. ముత్తుకూరు పట్టణంలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి కాకాణి రోడ్ షోను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎవరికి ఎంత నష్టం జరిగినా చంద్రబాబు పట్టించుకోడని, ఆయనకు సీఎం కుర్చీ కావాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామన్న బీజేపీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. తమది సెక్యులర్ పార్టీ అని అన్ని మతాలు వైఎస్సార్‌సీపీకి సమామన్నారు. ముత్తుకూరు మండలంలో పట్టుబట్టి మత్స్యకారేతర ప్యాకేజీని చెల్లించామని మంత్రి కాకాణి పేర్కొన్నారు. హామీలను నిలబెట్టుకున్నానని, తిరిగి తనను మూడో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈదూరు రాంప్రసాద్‌రెడ్డి, దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, కాకుటూరు లక్ష్మణ్‌రెడ్డి మునుకూరు జనార్థన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగణ, సర్పంచ్ బుదూరు లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

• పోలైన ఓట్లు 24,071

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరిగింది. ఇందులో మొత్తం 24,071 ఓట్లు పోలయ్యాయి. నెల్లూరు సిటీ 2,698, ఆత్మకూరులో 2,611, సర్వేపల్లిలో 1,397, ఉదయగిరిలో 2,493, కావలిలో 3,235, నెల్లూరు రూరల్‌లో 4,741, కోవూరులో 2,838, కందుకూరులో 1,908, ఇతర జిల్లాల వారికి సంబంధించి 2150 ఓట్లు నమోదయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతిచెందారు. సీఐ హైమారావు కథనం మేరకు.. సంగం మండలానికి చెందిన ఆలపాక పద్మమ్మ (75)కు నలుగురు సంతానం. ఈమె రెండో కొడుకు ఆలపాక శివప్రసాద్ (42)కు వివాహమైంది. అయితే భార్య నుంచి దూరంగా ఉంటున్నాడు. వ్యవసాయ పనులు చేస్తుంటాడు. తల్లీకొడుకు సొంత పని నిమిత్తం మోటార్‌బైక్‌పై బుచ్చిరెడ్డిపాళెం బయలుదేరారు. ఈ క్రమంలో రోడ్డుపై నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొంది. ప్రమాదంలో శివప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయలైన పద్మమ్మను నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె చనిపోయింది. గ్రామంలో విషాదం నెలకొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

• హత్య కేసుగా మార్పు

నెల్లూరు(క్రైమ్): కుమారుడు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని పుత్తా ఎస్టేట్‌కు చెందిన ఇందిరకు (54) ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కొడుకు గిరి బీవీ నగర్‌లో ఉంటుండగా చిన్న కొడుకు హరి ఆమెతోనే ఉంటున్నారు. హరి మద్యానికి బానిసయ్యాడు. గత నెల 29వ తేదీ రాత్రి తాగేందుకు డబ్బులివ్వాలని తల్లిని అడిగాడు. ఆమె తన వద్దలేవని చెప్పింది. దీంతో విచక్షణారహితంగా కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఈ విషయం తెలుసుకున్న గిరి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గాయాలతో ఉన్న తల్లిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. గిరి ఫిర్యాదు మేరకు అప్పట్లో చిన్నబజారు పోలీసులు నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇందిర హాస్పిటల్లో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. దీంతో హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్పు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బి.అశోక్ కుమార్ తెలిపారు.

నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు



సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న నాగమల్లేశ్వర్‌రెడ్డి

ఉదయగిరి: 'ఎన్నికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచాలి. నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం' అని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె.నాగమల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన గురువారం నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాల సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11వ తేదీ సాయంత్రం ఏడు నుంచి 13వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు మద్యం దుకాణాలు సీజ్ చేస్తారన్నారు. అందువల్ల ఎక్కడా మద్యం సరఫరా కావడానికి వీల్లేదన్నారు. దుకాణాలు మూసి ఉన్న సమయంలో మద్యం రవాణా జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి అమ్మకాలు జరిపినా, రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించినా సహించేది లేదన్నారు. బుచ్చి, ఆత్మకూరు, కలిగిరి, ఉదయగిరి సర్కిల్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాలు తనిఖీ చేసి సూపర్‌వైజర్లకు సూచనలిచ్చినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఉదయగిరి ప్రొహిబిషన్ సీఐ రమణమ్మ పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 157
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 274
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 304
లేయర్ చికెన్	: 162

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.35

సీఎం జగన్‌కే అన్ని వర్గాల మద్దతు

• వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి
• పార్టీలో చేరిన బొందిలి సామాజికవర్గ నాయకులు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, చిత్రంలో ఖలీల్ అహ్మద్

నెల్లూరు(దర్గామిట్ట): 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే అన్ని వర్గాల మద్దతు ఉంది. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయం' అని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. నాయకుడు మేఘనాథ్‌సింగ్ ఆధ్వర్యంలో గురువారం రామ్మూర్తినగర్‌లోని విజయసాయిరెడ్డి క్యాంపు కార్యాలయంలో బొందిలి సామాజికవర్గ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. కోటి సింగ్ తదితరులకు విజయసాయిరెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొందిలి సామాజికవర్గం కోసం సీఎం జగన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి గౌరవం కల్పించారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆ సామాజికవర్గం వారు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పాడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ వర్గాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అభ్యర్థన లేఖ పంపినా వారిని ఇంకా చేర్చలేదన్నారు. జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి అసెంబ్లీలో తీర్మానం చేయించి, పార్లమెంట్‌లో పోరాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రైతులకు మేలు



కొత్తవంగల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: 'గత టీడీపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం అన్ని విధాలుగా మేలు చేకూర్చింది' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మిక్కిలింపేట, కొత్తవంగల్లులో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తవంగల్లులో ఎమ్మెల్యే మాట్లాడుతూ చుక్కల భూములు, అసైన్డ్, ఈనాం భూములకు జగన్‌మోహన్‌రెడ్డి పట్టాలిచ్చారని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలోనే 2,700 ఎకరాల చుక్కల భూములకు విముక్తి కల్పించినట్లు చెప్పారు. వ్యవసాయ రంగానికి వైఎస్సార్, జగన్ పెద్దపీట వేశారన్నారు. పేదలు బాగుండాలని కోరుకునే జగన్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి దించేయాలని అన్ని పార్టీలు ఏకమైనట్లు చెప్పారు. ఎన్ని పార్టీలు కలిసినా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. పథకాలకు సంబంధించిన నగదు పడకుండా చంద్రబాబు అడ్డుకుని లబ్ధిదారులకు అన్యాయం చేశారన్నారు. ఇలాంటి వ్యక్తికి అవకాశమిస్తే పేదలకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. జిల్లా సమగ్రాభివృద్ధి చెందాలంటే నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీపీ జి.జ్యోతి, ఎంపీటీసీ ఎస్.ప్రసాద్, సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ఎ.సింధు, శైలజ, వైఎస్సార్‌సీపీ, సచివాలయాల మండల కన్వీనర్లు గంధం వెంకటశేషయ్య, కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు చక్కా మనోహర్ బాబు, వేముల వెంకటేశ్వర్లు, జుటూరు వెంకటకృష్ణారెడ్డి, శూలం హరిబాబు, మాలిచంద్రబాబు, జి.రామ్మోహన్‌రెడ్డి, చిట్టేటి మల్లికార్జున, కూరపాటి మస్తానయ్య పాల్గొన్నారు.

అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తా



రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

• ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: ఎమ్మెల్యేగా తనకు అవకాశమిస్తే ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బిజ్జంపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఆయన గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత హామీలిచ్చాడన్నారు. అధికారంలోకి రావాలని ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఫలించవన్నారు. ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్‌కు ఓట్లేస్తే నియోజకవర్గం పూర్తిగా నష్టపోతుందన్నారు. అభివృద్ధి ప్రదాత, సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రలోభాలకు లొంగకుండా ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.బలరామిరెడ్డి, బసిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు మూలె సుబ్బారెడ్డి, కల్లూరి కృష్ణారెడ్డి, కె.వెంకటేశ్వర్లురెడ్డి, అక్కుల్‌రెడ్డి, పెద్దిరెడ్డి గురవారెడ్డి, కొండా రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబకలహాలో మరే ఇతర కారణమో తెలియదు గానీ గుర్తుతెలియని వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నెల్లూరు కొండాయపాళెం రైల్వేగేటు సమీపంలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై గురువారం జరిగింది. మృతుడు బ్లూ కలర్‌పై బ్రౌన్ కలర్ డిజైన్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బ్లూ కలర్ కాటన్ షాట్ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): పోలింగ్ సందర్భంగా పత్రికల్లో ఇచ్చే రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ నుంచి అనుమతులు తప్పకుండా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్‌లో ఉన్న మీడియా సెంటర్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు ప్రసారం చేయకూడదన్నారు. ఎంసీఎంసీ నుంచి అనుమతి పొందిన తర్వాతే ప్రింట్ మీడియాలో మాత్రం ప్రచురించాలని సూచించారు. అలాగే ఈనెల 11వ తేదీ సాయంత్రం 6 గంటలతో అన్ని రాజకీయ పార్టీల వాహనాలకు అనుమతులు ముగుస్తాయన్నారు. పోలింగ్ రోజున అభ్యర్థికి ఒక వాహనం, ఏజెంట్‌కు ఒకటి, ఇతర పార్టీ ప్రతినిధులకు సంబంధించి మరో వాహనానికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఒక్కో దాంట్లో కేవలం ఐదుగురు ఉండాలన్నారు. వీటి అనుమతులను ఆర్‌ఓ కార్యాలయాల్లో పొందాలని సూచించారు. ఇప్పటి వరకు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో రాజకీయ ప్రకటనకలు ఇచ్చిన అనుమతులను, పెయిడ్ న్యూస్ వివరాలను సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డీపీఆర్వో టి.మోహన్‌రాజు, సమాచార శాఖ ఇంజనీరింగ్ అధికారి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆనం ప్రచారానికి కన్నబాబు డుమ్మా

ఆత్మకూరు: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ తెలుగుదేశంలో విభేదాలు పెరుగుతూ పోతున్నాయి. ఒకరి మధ్య ఒకరికి పొసగడం లేదు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. గురువారం కరటంపాడులో ఆ పార్టీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి నిర్వహించిన ప్రచారానికి ఆ గ్రామానికి చెందిన పార్టీ అధికార ప్రతినిధి గూటూరు కన్నబాబు డుమ్మా కొట్టడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఇది షెడ్యూల్ ప్రకారం నిర్వహించిన కార్యక్రమమే. అయితే సీనియర్ నాయకుడైన కన్నబాబు పాల్గొనకపోవడం, అసలు గ్రామానికే రాకపోవడంతో తెలుగు తమ్ముళ్లు పార్టీలో ఏం జరుగుతోందనని ఆందోళన చెందుతున్నారు.

శ్రీధర్‌రెడ్డికి రౌడీయిజం చేయడమే తెలుసు

• వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు సిటీ: 'టీడీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి రౌడీయిజమే తెలుసు. మాట వినని వారిపై దాడులు చేయించాడు. డబ్బు కోసం వ్యాపారస్తులను బెదిరించాడు. భూకబ్జాలకు పాల్పడ్డాడు. హోటళ్ల నిర్వాహకులు, రియల్ ఎస్టేట్ వారిపై దౌర్జన్యాలు చేశాడు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించడం తప్ప అభివృద్ధి చేసింది శూన్యం' అని వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గంలోని 2వ డివిజన్‌లోని అల్లీపురం, పెద్దచెరుకూరు, గుడపల్లిపాడు తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫలానా అభివృద్ధి పనిచేశానని చెప్పుకోలేని స్థితిలో శ్రీధర్‌రెడ్డి ఉన్నాడరన్నారు. తాను వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త అయ్యాక రూ.150 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేయించానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, 2వ డివిజన్ కార్పొరేటర్ పడిగినేటి రామ్మోహన్ యాదవ్, నాయకులు నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి, ఒ.మురళీరెడ్డి, వి.రాజారెడ్డి, నెల్లూరు ప్రసన్నకుమార్‌రెడ్డి, లేబూరు పరమేశ్వరరెడ్డి, ఎం.ప్రతాప్‌రెడ్డి, ఒకటో డివిజన్ కార్పొరేటర్ నాగరాజ్‌గౌడ, నియోజకవర్గ పరిశీలకుడు మల్లు సుధాకర్‌రెడ్డి, సీహెచ్ హరిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంచిని చూడండి.. ఆశీర్వదించండి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



కాకివాయిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని చూడండి. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఆశీర్వదించండి' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. మండలంలోని కాకివాయి, కండాపురం, చిత్తలూరు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఐదు సంవత్సరాలు ఈ ప్రభుత్వం ఎలా పని చేసిందో అందరూ గమనించాలన్నారు. ప్రతిపక్ష నాయకులు బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, వారిని ఎవరూ లెక్క చేయాల్సిన అవసరం లేదన్నారు. పేదల సంక్షేమానికి జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కాకివాయిలో 250 ఎకరాల్లో రైతుల సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. జగనన్న పాలనలో రాష్ట్రంలో పేదరికం తగ్గుముఖం పట్టిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేలూరు తిరుపతినాయుడు, నాయకులు పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, బి.సుధాకర్‌రెడ్డి, పి.రామమనోహర్‌రెడ్డి, ఎ.రాజశేఖర్‌రెడ్డి, నాగానాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, రజనీకాంత్, ఎర్రగుంట పెంచలయ్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం, నగదు కోసమే వృద్ధురాలి హత్య

• సమీప బంధువే నిందితుడు

సంగం: వృద్ధురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. మనవడి వరుసయ్యే వ్యక్తి బంగారం, నగదు కోసం తన స్నేహితుడితో కలిసి దారుణానికి ఒడిగట్టినట్లు గుర్తించారు. సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్ కథనం మేరకు.. మండలంలోని జెండాదిబ్బ దళితవాడలో సుబ్బమ్మ (60) అనే వృద్ధురాలు నివాసం ఉంటోంది. ఆమెకు తువ్వర అనిల్ మనవడు అవుతాడు. అనిల్, అతని స్నేహితుడు షేక్ ఆరిఫ్ మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో సుబ్బమ్మ వద్ద బంగారం కాజేయాలని చూశారు. సోమవారం రాత్రి ఇద్దరూ ఆమె వద్దకు వెళ్లారు. ఆధార్ కార్డుకు ఫొటో తీసుకుంటామని అనిల్ చెప్పాడు. అందుకు ఆమె అంగీకరించింది. ఇంట్లోకి వెళ్లగా అనిల్ సుబ్బమ్మ మెడకు చీరను చుట్టాడు. ఆరిఫ్ కాళ్లను పట్టుకున్నాడు. ఇద్దరూ కలిసి హత్య చేసి సుబ్బమ్మ మెడలోని నాలుగు సవర్ల గొలుసు, కమ్మలు, రూ.3,200 నగదు తీసుకున్నారు. మృతదేహాన్ని కాల్చేసేందుకు ఇంటి నుంచి 20 మీటర్ల దూరం తీసుకొచ్చారు. ఆ సమయంలో ఓ వ్యక్తి బైక్‌పై రావడంతో ఇద్దరూ మృతదేహాన్ని అక్కడే వదిలేసి పరారయ్యారు. బైక్‌పై వచ్చిన వ్యక్తి చూసి సంగం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నిందితులు అనిల్, ఆరీఫ్‌ను గురువారం బుచ్చిరెడ్డిపాళెంలో పట్టుకుని కోర్టుకు హాజరుపరిచారు. వారి నుంచి బంగారం, నగదును తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సింహపురిలో సింహనాదం

అప్పుడు వైఎస్సార్, ఇప్పుడు జగన్ పక్షం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గత ఎన్నికల్లో క్లీన్ స్వీప్

ఐదేళ్ల పాలనలో 'పార్టీల' ముద్ర చెరిపేస్తూ దూకుడు

ఓటమి వీరుడుగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ మళ్లీ క్లీన్‌స్వీప్ చేయబోతుంది. రెండు దశాబ్దాలుగా వైఎస్సార్ కుటుంబానికి జిల్లా అండగా నిలుస్తోంది. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్య, ఆరోగ్యంతోపాటు వ్యవసాయ రంగానికి కీలకమైన నీటి ప్రాజెక్టులు, ఉపాధి కల్పనకు పరిశ్రమలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల సరిహద్దుల్లో ప్రపంచస్థాయి ప్రామాణికాలతో పారిశ్రామిక కేంద్రం శ్రీసిటీని, తూర్పు తీరం సిగలో కృష్ణపట్నం పోర్టు, విద్యుత్ థర్మల్ ప్లాంట్లు తెచ్చి ప్రజల జీవన ప్రమాణాలను పెంచారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో తన తండ్రి వైఎస్సార్‌కు మించి సంక్షేమం, అభివృద్ధితో పూర్తిగా జనం గుండెల్లో గూడుకట్టుకున్నారు. ఈ దశలో జరిగే ఎన్నికల్లో గతం కంటే మిన్నగా ఓట్ల శాతం అధికంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



'ఆదాల' అడ్డా

నెల్లూరు రూరల్ స్థానం నుంచి ప్రస్తుత ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆదాల రాజకీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి మంత్రిగా, ఒకసారి ఎంపీగా గెలిచారు. ప్రధానంగా నెల్లూరు రూరల్ నుంచి గతంలో వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యేగా గెలిచి టీడీపీలో చేరిన కోటంరెడ్డి ప్రస్తుతం ఆదాలకు ప్రత్యర్థిగా బరిలో ఉన్నారు. కోటంరెడ్డి అవినీతి, అరాచకాలు మితిమీరడంతోనే వైఎస్సార్‌సీపీ ఆయన్ను పక్కన పెట్టింది. కోటంరెడ్డితో వెళ్లిపోయిన వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు టీడీపీ క్యాడర్‌ను తన వైపునకు ఆదాల తిప్పుకున్నారు. ఈ నియోజకవర్గంలో మైనార్టీలు మద్దతుగా ఉన్నారు.

మెజార్టీ 'మేకపాటి'కే..

మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఉదయగిరిలో విద్యా సంస్థలు నెలకొల్పి మెట్ట ప్రాంత విద్యార్థులకు బాసటగా నిలిచారు. మెట్ట భూములను సస్యశ్యామలం చేయడానికి సోమశిల ఉత్తర కాలువ, వెలిగొండ ప్రాజెక్టుల సాధనకు ఎంతో కృషి చేశారు. గతంలో ఈ నియోజకవర్గం నుంచి రాజమోహన్‌రెడ్డి సోదరుడు చంద్రశేఖరరెడ్డి వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ ప్రలోభాలకుగురై వెళ్లిపోయాడు. దీంతో రాజమోహన్‌రెడ్డి తన మరో సోదరుడు రాజగోపాల్‌రెడ్డిని నిలబెట్టారు. ఇంటింటికీ తిరిగి ప్రజాదరణ పొందారు. టీడీపీ నుంచి ఎన్ఆర్ఐ కాకార్ల సురేష్ బరిలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు ఆయన వర్గం టీడీపీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేస్తోంది.

అహ్మాద్ అదరహో

నెల్లూరు సిటీలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఖలీల్ అహ్మాద్ విజయం అదరహో అంటున్నారు నియోజకవర్గ ప్రజలు. కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ అయిన ఖలీల్ అహ్మాద్‌కు నగరంలో అన్ని వర్గాలతో విస్తృత పరిచయాలున్నాయి. ఈ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా ఉంది. గత రెండుసార్లు సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించారు. తాజాగా ఈ ఎన్నికల్లో సంక్షేమం తోడైంది. ఈయనకు ప్రధాన ప్రత్యర్థిగా కార్పొరేట్ విద్యాసంస్థల అధినేత పొంగూరు నారాయణ వందల కోట్లు ఖర్చు చేస్తూ బరిలో నిలబడ్డారు. ముఖ్యంగా టీడీపీ అభ్యర్థి నారాయణ గతంలో మంత్రిగా ఉండి టిడ్కో ఇళ్ల పేరుతో చేసిన మోసాన్ని ప్రజలు మరిచిపోలేదు. ఈ ఇళ్లను జగన్ పూర్తి చేసి లబ్ధిదారులకు ఉచితంగా అందించారు. ఐదారు లక్షల విలువైన ఇంటి స్థలాలను అందించిన మంచిపేరుంది.



మళ్లీ గోవర్ధనుడే..

సర్వేపల్లి మళ్లీ గోవర్ధనుడిదేనని ఎన్నికల వాతావరణం చెబుతోంది. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. ఆ ఓటింగ్ వైఎస్సార్‌సీపీ వైపు మళ్లింది. దీంతో నాలుగు పర్యాయాలు కాంగ్రెస్ తరఫున ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తరువాత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వరుసగా 2014, 2019 ఎన్నికల్లో ఎన్నికయ్యారు. అంటే రెండు దశాబ్దాలుగా టీడీపీ అక్కడ నిలబడలేకపోయింది. వరుసగా నాలుగు పర్యాయాలు ఓటమి వీరుడుగా టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నిలిచిపోయారు. ఆయనకే టీడీపీ టికెట్ ఈసారి కూడా ఇవ్వడంతో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమైనట్టుగా కనిపిస్తోంది.

వార్ వన్ సైడే

కావలి నియోజకవర్గం ఆది నుంచీ వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా ఉంది. ఇక్కడ స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. మత్స్యకారుల దశాబ్దాల కల రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి పూర్తి చేశారు. 2014, 2019 ఎన్నికల్లో ప్రత్యర్థులుగా నిలిచిన బీద మస్తాన్‌రావు (రాజ్యసభ సభ్యుడు), మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డిలు వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు. వీరి బలం కూడా తోడు కావడంతో ఆ పార్టీ విజయం నల్లేరుపై నడకగా మారింది. టీడీపీ నుంచి బరిలో నిలిచిన కావ్య కృష్ణారెడ్డి అలియాస్ దగుమాటి కృష్ణారెడ్డి వివాదాస్పదుడు. తన సొంత నియోజకవర్గంలో కంకర క్వారీలు, మైనింగ్, ఇసుక, రియల్ ఎస్టేట్‌తో రూ.వేల కోట్లు అక్రమార్జన చేశారన్న విమర్శలున్నాయి.

కందుకూరులో మారోమారు

కందుకూరు నియోజకవర్గం మరోసారి వైఎస్సార్‌సీపీకే వన్స్‌మోర్ పలకనుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని ఒప్పించి బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన బుర్రా మధుసూదన్ యాదవ్‌ను బరిలో నిలబెట్టింది. ప్రధానంగా ఈ నియోజకవర్గంలో యాదవులు అత్యధికంగా ఉన్నారు. మధుసూదన్ యాదవ్ విజయానికి మహీధర్ రెడ్డి అహర్నిశలూ శ్రమిస్తున్నారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు ఓటు బ్యాంక్‌గా మారాయి. ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు. అన్నదమ్ముల మధ్య సమన్వయలోపం కనిపిస్తోంది. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కూడా అలకపాన్పు వహించారు. ఇక్కడ ఓటు బ్యాంక్ భారీగా చీలిపోయి..వైఎస్సార్‌సీపీకి బదిలీ అవుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

నెల్లూరు పార్లమెంట్ విజయసాయిదే

నెల్లూరు పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజేతగా నిలబడనుంది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజవర్గాల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి క్లీన్‌స్వీప్ చేయనున్న నేపథ్యంలో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి విజయం నల్లేరుపై నడకేనని తెలుస్తోంది. నెల్లూరు పార్లమెంట్ చరిత్ర పరిశీలిస్తే ఈ నియోజకవర్గంలో 1999లో ఒక్కసారి మాత్రమే టీడీపీ విజయం సాధించింది. ఇప్పటి వరకు టీడీపీ గెలిచిన చరిత్రే లేదు. గతంలో కాంగ్రెస్, ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయం సాధిస్తూ వస్తున్నారు. రాజ్యసభ సభ్యుడిగా విజయసాయిరెడ్డి కేంద్ర స్థాయిలో అన్ని శాఖల అధికార యంత్రాంగంతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆయన ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రత్యేక జాబ్‌మేళాలు పెట్టి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారు. తాజాగా ఆయన నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో జిల్లా అభివృద్ధికి ప్రత్యేకించిన మేనిఫెస్టోను ప్రకటించారు. తన చెప్పిన మేనిఫెస్టోను నిర్దిష్ట వ్యవధిలో పూర్తి చేసి, జిల్లాను స్వర్గధామంగా మారుస్తానని చెబుతున్నారు. మరో వైపు విజయసాయిరెడ్డికి ప్రత్యర్థిగా ధనబలంతో వేమిరెడ్డి పోటీ చేస్తున్నారు. కేవలం డబ్బులుంటే అధికార పీఠమెక్కవచ్చనే ఆయన ఆలోచన తప్పు.. తాను గెలిస్తే జిల్లాకు చేసే అభివృద్ధి ప్రణాళిక అంటూ ఏమీ లేకపోవడంతో విజయసాయిరెడ్డి విజయం ఖాయంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు.

గురుమూర్తి వన్స్‌మోర్..


తిరుపతి ఎంపీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తికి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. తిరుపతి ఎంపీగా మూడేళ్ల క్రితం ఉప ఎన్నికల్లో గురుమూర్తి విజయం సాధించారు. మృదుభాషిగా పేరున్న గురుమూర్తి గడిచిన మూడేళ్లలో పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలతో అవినావభావ సంబంధాలు పెంచుకున్నారు. మరో వైపు ప్రత్యర్థిగా గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఎమ్మెల్యేగా వరప్రసాద్ అవినీతి, అక్రమాల్లో పీకల్లోతులో కూరుకుపోవడంతో వైఎస్సార్‌సీపీ ఆయన్ను పక్కన పెట్టింది. దీంతో ఆయన టీడీపీ సహకారంతో బీజేపీ టికెట్ దక్కించుకుని బరిలో నిలిచారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో టీడీపీ గెలిచిన చరిత్ర లేదు. 1999లో టీడీపీ మద్దతుతో బీజేపీ స్వల్ప మెజార్టీతో విజయం సాధించింది. ఇక్కడ టీడీపీ గెలిచిన చరిత్రే లేదు. తాజాగా కూడా టీడీపీ ఓటమి భయంతోనే ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయించింది. క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉండడంతో, ఆ పార్టీ అభ్యర్థి గురుమూర్తి సైతం ప్రజల్లో ఒకడిగా ఉండడం ఆయన విజయం లాంఛనమే అని స్పష్టమవుతోంది.

కోవూరు గుండెల్లో 'ప్రసన్న'

జిల్లా రాజకీయాల్లో దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి లెజండ్రీ లీడర్. ఆయన రాజకీయ వారసుడిగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని కోవూరు తన గుండెల్లో దాచుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది సార్లు పోటీ చేసి ఆరు సార్లు గెలిచారు. గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి తోడవడంతో ఈ ఎన్నికల్లో విజయం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ ప్రధాన ప్రత్యర్థిగా ఆగర్భ శ్రీమంతుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ప్రశాంతి రెడ్డి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆమె రాజకీయాలకు కొత్త. అన్ని వర్గాలను కలవడంలో వెనకబడుతున్నారు.

విక్రమ్‌దే విజయం

దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి ఆకస్మిక మరణంతో రాజకీయాల్లోకి వచ్చి అంచనాలకు మించిన మెజార్టీతో ఎమ్మెల్యేగా ఎన్నికైన మేకపాటి విక్రమ్‌రెడ్డి పట్టుమని రెండున్నరేళ్లు కూడా కాకుండానే తాజాగా ఎన్నికల బరిలో మళ్లీ తలపడుతున్నారు. ఒకే ఒక్కడు విక్రమ్‌రెడ్డిపై టీడీపీ నుంచి ఐదుగురు మాజీ ఎమ్మెల్యేలు దండయాత్ర చేస్తున్నారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి తొలిసారి ఎమ్మెల్యేగా, రెండో దఫా మంత్రిగా రెండున్నరేళ్లలోనే నియోజకవర్గంలో చెరగని ముద్ర వేశారు. సోమశిల ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలో సాగునీటి కేటాయింపులులేని పరిస్థితి. గౌతమ్‌రెడ్డి చొరవతో డెల్టాకు సమానంగా 80 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేయించారు. టీడీపీ అభ్యర్థిగా ఆనం రామనారాయణ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఈయన పలు పార్టీలు మారుతున్నారన్న ముద్ర ఉంది. ఏ వర్గమూ ఈయన వెంట మనస్ఫూర్తిగా పని చేయడం లేదని ఆ పార్టీవాళ్లే గుసగుసలాడుకుంటున్నారు.



- అందుకే సామాన్యుడైన నాకు అవకాశం
- ఎమ్మెల్యే అనిల్ అన్న ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి
- టీడీపీ అభ్యర్థి నారాయణను ప్రజలు నమ్మడం లేదు
- విజయసాయిరెడ్డి నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- మా ఇద్దరి విజయం నల్లేరుపై నడకే
- 'సాక్షి'తో వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మాద్

నా విజయం.. ప్రజల గెలుపు

ప్రజలపై జగనన్నకు అపార నమ్మకం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సింహపురి.. ఆ పేరే ఒక చరిత్ర. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో నెల్లూరు జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. రాజకీయ ఉద్దండులకు నెలవైన నెల్లూరును 'పెద్దా రెడ్లు' శాసించిన చరిత్ర. అటువంటి నెల్లూరు నుంచి వైఎస్సార్‌సీపీ అతి సామాన్యులను బరిలోకి దింపి అప్రతిహత విజయాల దిశగా దూసుకుపోతోంది. 2014, 2019 ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన అనిల్‌కుమార్‌యాదవ్‌ను నెల్లూరు గడ్డపై ఆ పార్టీ నిలబెట్టింది. ప్రస్తుత ఎన్నికల్లో అతి సామాన్యుడైన ముస్లిం మైనార్టీకి చెందిన ఖలీల్ అహ్మాద్‌ను నిలబెట్టింది. ఇది రాజకీయాల్లో సాహసోపేతమైన నిర్ణయమే అయినప్పటికీ.. నెల్లూరు ప్రజలపై ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న అంచెంచలమైన విశ్వాసమే అనే ప్రచారం ప్రతి సగటు వ్యక్తిని ఆలోచింప చేస్తోంది. తాను విజయం సాధించినా.. ఆ గెలుపు ప్రజలది.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని అంటున్న నెల్లూరు సిటీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మాద్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న : మీరు సామాన్యులు.. మీ ప్రత్యర్థి సంపన్నుడు. ఈ ఎన్నికల్లో మీరు విజయం సాధిస్తారనే నమ్మకం ఉందా? మీ ప్రత్యర్థి నారాయణ విజయం చాలా ఈజీ అని ప్రజలు అనుకున్నారు. ప్రస్తుతం వాతావరణం ఎలా ఉంది?

జవాబు : మా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అతి సామాన్యుడైన నన్ను అత్యంత ప్రతిష్టాత్మకైన నెల్లూరు సిటీ బరిలో నిలబెట్టినప్పుడే మా ప్రత్యర్థి పార్టీలో వణుకు ప్రారంభమైంది. ఎందుకంటే నాకు ప్రత్యర్థిగా పోటీ చేస్తున్న పొంగూరు నారాయణ సంపన్నుడు. సాధారణంగా నారాయణపై నేను పోటీచేస్తుండడంతో ఆయన విజయం సాధిస్తారంటూ ప్రచారం చేసుకున్నారు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో టీడీపీకి, నారాయణకు జనాదరణ లేదనే విషయం వారు గ్రహించారు. ప్రతి సామాన్యుడికి ఈ ప్రభుత్వం చేసిన మేలు ఎంతో ఉండడంతో మా పార్టీ క్షేత్రస్థాయిలో చాలా బలంగా ఉంది. ప్రధానంగా పెద్దలు, రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా రావడంతో రాజకీయ పరిణామాలు మారిపోయాయి. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్ని వర్గాలను సమన్వయ పరచడంలో ప్రత్యర్థుల గుండెల్లో భయం పట్టుకుంది. అంతకు ముందే బలంగా వైఎస్సార్‌సీపీ మరింత బలంగా మారింది. అందుకే టీడీపీ పెద్దలు ఒకటికి నాలుగు సార్లు వచ్చి ప్రచారం చేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కచ్చితంగా ప్రజల ఆశీస్సులు, మా పార్టీ పెద్దలు, స్థానికంగా ఉన్న నేతలందరి కృషితో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సంపన్నుడైన నారాయణపై మంచి మెజార్టీతోనే గెలుస్తాను.

ప్రశ్న : నెల్లూరును నారాయణే అభివృద్ధి చేశారని ప్రచారంపై మీరేమంటారు?

జవాబు : ఆయన హయాంలోనే నెల్లూరు భారీగా విధ్వంసం అయింది. నారాయణ మున్సిపల్ మంత్రిగా ఉండి..ఆయనతో పాటు టీడీపీ నేతలకు దోచిపెట్టారు. నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇంటింటికి శుద్ధి జలం అంటూ 2016లోనే వందల కోట్లు హడ్కో ద్వారా రుణాలు తెచ్చారు. ముందుగానే ఆ పనులు చేయకుండా.. ఎన్నికలకు ఆరు నెలల ముందు పనులు ప్రారంభించి.. హడావుడిగా, అరకొరగా పనులు చేసి మొత్తం సొమ్మును కాజేశారు. 40 వేల టిడ్కో ఇళ్లు కట్టించానని గొప్పలు చెబుతున్న నారాయణ ఆ ఇళ్ల నిర్మాణంలోనే వేల కోట్ల దోచుకున్నారు. టీడీపీ హయాంలో కట్టిన టిడ్కో ఇళ్లకు సైతం వారు డబ్బులు చెల్లించకపోతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే టిడ్కో కాంట్రాక్టర్లకు రూ.400 కోట్లు చెల్లించింది. టిడ్కో ఇళ్ల అయితే బయట పూర్తి చేశారే కానీ.. లోపల పనులన్ని పెండింగ్‌లో పెట్టారు. జనానికి కనిపించేది బయటే కాదా?. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ టిడ్కో ఇళ్లను పూర్తి చేయడమే కాకుండా.. నెల్లూరు నగరంలో 70 వేల మందికి సెంట్ స్థలం ఇచ్చారు. ఇళ్లు కట్టిస్తున్నారు. ఆయన చేసిన అభివృద్ధి పని ఒకటి చూపించగలరా?. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వాటర్ పైపులైన్ల కోసం టీడీపీ బాధ్యతా రాహిత్యంతో అప్పులు చేస్తే, పేదల మీద పన్నుల భారం పడకుండా ఏకంగా రూ.731 కోట్ల రుణాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. కరోనా సమయంలో కూడా వ్యాపార ధోరణిలోనే ఆస్పత్రిని నిర్వహించాడు. మేము అయితే కరోనా కాలంలో 24 గంటలు ప్రజలకు సేవలు అందించాం. అప్పట్లో ముస్లింలపై వచ్చిన ఆరోపణలు సైతం లెక్క చేయకుండా మేము అందించిన సేవలను అందరు మెచ్చుకున్నారు. ప్రచార ఆర్భాటం తప్ప నారాయణ నెల్లూరు అభివృద్ధికి చేసిందేమీ లేదు.



ప్రశ్న: ప్రజలు మిమ్మల్ని ఎలా ఆదరిస్తున్నారు?

జవాబు : ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆప్యాయంగానే ఆదరిస్తున్నారు. ఇక్కడ నేను ముఖ్యం కాదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలే మా పార్టీకి స్టార్ క్యాంపెయినర్లుగా పనిచేస్తున్నారు. గడప గడపకు కార్యక్రమంతో ప్రతి ఒక్కరిని ఇంటింటికి పరిచయం చేస్తూ వారి సమస్యలను తెలుసుకునేందుకు వీలైంది. అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపించడంతో ప్రజలకు మరింత చేరువయ్యాము. అందరు కలిసి నా విజయానికి కృషి చేస్తున్నారు.

ప్రశ్న : ప్రచారంలో మీరు కేవలం ముస్లిం ప్రాంతంల్లోనే తిరుగుతున్నారని అనుకుంటున్నారు ?

జవాబు : ఇది పూర్తిగా అవాస్తవం. నేను ప్రణాళికా బద్ధంగా అన్ని డివిజన్లలో ప్రచారం నిర్వహిస్తున్నాను. ఇంకా చెప్పాలంటే ముస్లిం ప్రాంతాల్లోనే తక్కువ ప్రచారం చేశాను. నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో నగరంలోని ప్రతి ప్రాంతం, ప్రతి కమ్యూనిటీ కవర్ అయ్యేలా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విజయసాయిరెడ్డి సతీమణి సునందారెడ్డి, కుమార్తె నేహారెడ్డి, నా సతీమణి నసీమాలు ప్రత్యేకంగా ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పర్యటిస్తూ ఎంతో కష్ట పడుతున్నారు.

ప్రశ్న: మరి మీ ప్రభుత్వం వచ్చాక మీరు చేసిన అభివృద్ధి ఏమిటి?

జవాబు : ఎమ్మెల్యే డాక్టర్ పి. అనిల్‌కుమార్ ఆధ్వర్యంలోనే నెల్లూరును ఎంతో అభివృద్ధి జరిగింది.రూ.100 కోట్లతో సర్వేపల్లి కెనాల్‌కు శాశ్వత రివిట్‌మెంట్, మరో రూ.100 కోట్లతో జాఫర్ సాహెబ్ కెనాల్ రివిట్‌మెంట్, సుందరీకరణ, రూ.105 కోట్లతో వెంకటేశ్వరపురం దగ్గర ఎంతటి వరదలు వచ్చినా ముంపు రాకుండా కడుతున్న పెన్నా రిటైనింగ్ వాల్, రూ.110 కోట్లతో పెన్నానదిపై రెండో బ్రిడ్జి పనులు, రూ.90 కోట్లతో నెల్లూరు బ్యారేజీ, రూ.40 కోట్లతో రామలింగాపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి, రూ.25 కోట్లతో రంగనాయకుల గుడి, పాత చెక్‌పోస్ట్ దగ్గర రెండు అండర్ పాస్‌ల నిర్మాణం, రూ.32 కోట్లతో అద్భుతంగా శెట్టిగుంట రోడ్డు, మైపాడుకు వెళ్లే 4 లైన్ల రోడ్, రూ. 35 కోట్లతో 32 మున్సిపల్ పాఠశాలల అభివృద్ధి, రూ.20 కోట్లతో 34 పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దాం. రూ.150 కోట్లతో ఒక్క రూపాయి కూడా అప్పు లేకుండా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రోడ్స్, డ్రెయిన్స్ పూర్తి చేశాం. రూ.15 కోట్లతో షాదీ మంజిల్, ఘోష హాస్పిటల్‌ని పూర్తి చేసుకున్నాం. రూ.10 కోట్లతో 13 అర్బన్ హెల్త్ సెంటర్లనునిర్మించి సామాన్యులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నాం. రూ.101 కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్, 8 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పను లు జరుగుతున్నాయి. సుమారు రూ.220 కోట్ల విలువ కలిగిన ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత మా పార్టీది.

ప్రశ్న : రాజకీయ ప్రస్థానం?

జవాబు : 2014లో 43వ డివిజన్ కార్పొరేటర్‌గా రాజకీయ ప్రస్థానం మొదలైంది. మా ఇంట్లో అంతకు ముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. మొదటి నుంచి ప్రజలకు సేవ చేయాలనే భావనతో రాజకీయాల్లోకి వచ్చాను. 2019లో మళ్లీ కార్పొరేటర్‌గా ఎన్నికైన తర్వాత డిప్యూటీ మేయర్‌గా నాకు అవకాశం దక్కింది. అనిల్ అన్న ప్రోత్సాహంతో ఊహించని రీతిలో జగనన్న నాకు నగర ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు.

ప్రశ్న : మీరు గెలిస్తే రాబోయే రోజుల్లో నగరాభివృద్ధికి మీ ప్రణాళిక?

జవాబు : ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి నెల్లూరు జిల్లాకు, నెల్లూరు సిటీకి ప్రత్యేక మేనిఫెస్టోని రూపొందించారు. నెల్లూరు సిటీని గ్రీన్ సిటీగా, ఐటీ హబ్‌గా, స్పోర్ట్స్ హబ్‌గా రూపొందిస్తాం. డివిజన్లో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లి ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. ఇప్పటికే సిటీ నియోజకవర్గంలో సుమారు రూ.1,933 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశాము. రూ.1125 కోట్లతో సంక్షేమ పథకాలను కులమతాలకతీతంగా అందరికి అందించాం. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికి అందేలా నిరంతరం శ్రమిస్తాం.

ప్రశ్న: నగర ప్రజలకు మీరిచ్చే సందేశం ఏమిటి?

జవాబు: ప్రజలందరికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా మంచి చేశారు. ఈ మంచి మళ్లీ కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. నారాయణ వంటి ధనవంతులుఉ ఓటుకు రూ.వేలు ఇస్తారు. వారిచ్చే వెయ్యి.. రెండు వేలకు మీ ఓటు పొరపాటున టీడీపీకి వేస్తే.. ఐదేళ్లు మళ్లీ నరకమైన బతుకులు బతకాల్సి వస్తుంది. మనకు వచ్చే సంక్షేమ పథకాలు ఆగిపోతాయి. డబ్బులు ఇస్తే తీసుకోండి.. కానీ మీ భవిష్యత్‌ను, మీ బిడ్డలను భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఓటు వేయమని ప్రతి ఓటరును ముకుళిత హస్తాలతో ప్రార్థిస్తున్నాను. చివరగా నేను సామాన్యుడిని.. నన్ను చూసి కాదు.. జగనన్నను చూసి ఓటెయ్యమని విద్యావంతులు, మేధావులను, మహిళలను, యువతను కోరుతున్నాను. గెలిపించేది నన్ను కాదు.. జగనన్నను అని గుర్తుపెట్టుకోమని విన్నవించుకుంటున్నాను.

Published and Printed by V.Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 158/1-B, Kondayapalem Village, Nellore Town, Nellore Dist - 524 004 A.P. and Printed at Jagati Publications Limited Survey No 158/1 - B, Kondayapalem Village, Nellore Town, Nellore Dist - 524 004 A.P.; Editor: V.Murali, (Responsible for selection of News under the PRB Act) Phone Nos. 0861- 2333905, 906,907,908, Fax 2333909, RNI Regn No.APTEL/2008/23804. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited